RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | బుధవారం 22-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 293 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

- హైదరాబాద్‌కు చెందిన కుటుంబంలో ముగ్గురి మృతి
- అమెరికాలోని కాలిఫోర్నియాలో రోడ్డు ప్రమాదం
- నవీద్ భార్య, కుమార్తె, కుమారుడు మృతి
- తీవ్రంగా గాయపడిన నవీద్, చిన్నకూతురు



2లో

## ఓటర్ల జాబితా సవరణ

ఆధార్‌పై తెలంగాణ సీఈవో కీలక ప్రకటన

ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం ఆధార్ తప్పనిసరి కాదని స్పష్టీకరణ

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి

ఇతర గుర్తింపు పత్రాలతో నమోదు చేసుకునేందుకు అవకాశం



## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి: బొత్స

యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స

కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని వెల్లడి

స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి దోపిడీ చేస్తున్నారని ఆరోపణ

## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు: హరీశ్ రావు

దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్

దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా

నీళ్ల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శ



2లో

# ప్రధాని నివాసం 'యుద్ధరంగం'

**రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు

అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్

ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత



నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు.

2లో



## నేడు పొగాకు రైతులతో వైఎస్ జగన్ సమావేశం

అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతులతో సమావేశం కానున్నారు.



## తిరిగి వస్తామంటే వారిని చేర్చుకోను

### పార్టీ వీడిన నేతలకు మమత నో ఎంట్రీ బోర్డు

పార్టీ వీడిన నేతలను తిరిగి చేర్చుకోబోమని మమత స్పష్టీకరణ

బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఐక్యంగా పోరాడాలని పిలుపు

లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి పరిరక్షణకు ఇది అవసరమని వెల్లడి

## రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు..

**భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం**

బుధవారం నాడు ఢిల్లీ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం

ఆగస్టు 1న అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ప్రారంభం

హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. విజయనగరం జిల్లాలోని భోగాపురంలో నూతనంగా నిర్మించిన విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని

2లో



## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళిక

**వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం తగ్గించేందుకు ముందస్తు చర్యలు**

ప్రత్యామ్నాయ పంటలు, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల మార్పులు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న తెలంగాణలోని వర్షపాతం, చెరువులు, వాగులు, వ్యవసాయంపై ఎలా ప్రభావం చూపుతాయో శాస్త్రవేత్తలతో

# ప్రధాని నివాసం 'యుద్ధరంగం'

(మొదటి పేజీ తరువాయి)

అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను



పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

# ఎల్‌నినో' సవాళ్లపై పక్కా ప్రణాళిక

విశ్లేషించి కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు 'జరిగిన అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సుకు మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సమస్య తీవ్రతను ముందుగానే అర్థం చేసుకుంటే ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం స్వయంగా తగిన ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. తాగునీరు, సాగునీటితోపాటు పశువులు, పక్షులు, అడవి జంతువుల నీటి, ఆహార అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**సోలార్ విద్యుత్‌తో భారం తగ్గింపు**

ఎల్ నినో కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం సమర్థవంతమైన ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తోందని భట్టి తెలిపారు. పగటి పూట తక్కువ ధరకు లభించే సౌర విద్యుత్‌ను గరిష్టంగా వినియోగించడం ద్వారా ప్రజలపై, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, భూగర్భ జలాలు తదితర శాఖల సమన్వయంతో సదస్సు నిర్వహించడం ప్రభుత్వ సమగ్ర ప్రణాళికకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అవగాహన సదస్సులను జిల్లాల వారీగా కూడా నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

**వాతావారణ మార్పులకు అనుగుణంగా..**

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరి కాకుండా ఆరు తడి పంటలు వేయాలని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. ఇది ఒక ప్రాంతమో, ఒక రాష్ట్రమో ఎదుర్కొంటున్న సమస్య కాదని, ప్రపంచం మొత్తం ఉందన్నారు. దీంతో ధరల ప్రభావం, నీటి కొరత, పశువులకు, పక్షులకు, అడవులు, యావత్ ప్రపంచానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగహన కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. అయితే వర్షాలు రెండు మూడు నెలల తర్వాత పడే అవకాశం లేకపోలేదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్‌నినో 2027 వరకు కొనసాగే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, పీఆర్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి గోపి, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ప్రణాళికా శాఖ డైరెక్టర్ రూఫస్ దత్తం, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## తిరిగి వస్తామంటే వారిని చేర్చుకోను

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పార్టీని వీడి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు 'ఇండియా' కూటమిలోని పక్షాలన్నీ ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. కోల్‌కతాలో మంగళవారం ఓ కార్యక్రమంలో మమత బెనర్జీ మాట్లాడారు. లౌకికవాదాన్ని, సమాఖ్య స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పాలనను కాపాడుకోవడానికి ప్రతిపక్షాల ఐక్యత ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. విపక్ష కూటమిలోని పార్టీలు విభేదాలను పక్కన పెట్టి ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీని వీడిన ద్రోహులను ఎప్పటికీ తిరిగి చేర్చుకోబోమని, ఈ విషయంలో తనకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు."పార్టీని వీడుతున్న వారికి నేను ఒక్కటే చెబుతున్నాను. బీజేపీకి మద్దతుగా నిలవాలనుకుంటే నేరుగా ఆ పార్టీలోనే చేరి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్నాను. ఎంత ఎక్కువ మంది వెళ్లిపోతే నాకు అంత సంతోషం. ఆయా స్థానాలను యువ నాయకులతో భర్తీ చేస్తాను" అని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు.

## అమెరికాలోఘోర రోడ్డు ప్రమాదం..





అమెరికాలో జరిగిన ఒక ఘోర ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద వార్త తెలియడంతో వారి బంధువర్గం, తెలుగు ఎన్నారై సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం, అమెరికాలోని కాలిఫోర్నియాలో చోటుచేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అధికారులు, భారత రాయబార కార్యాలయం అధికారులు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు.హైదరాబాద్‌లోని యాకుత్‌పురా ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ నవీద్ గతంలో నగరంలోని ఒక ప్రముఖ ఫార్మా ల్యాబ్‌లో పని చేశారు. ఇటీవల అమెరికాలోని మెర్క్ ఫార్మా కంపెనీలో ఉద్యోగం రావడంతో ఆయన తన కుటుంబంతో సహా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో నవీద్ భార్య నజియా (45), కుమార్తె హఫీజా షేక్ (19), కుమారుడు హఫీజ్ ఒమర్ (14) మృతి చెందారు. నవీద్‌తో పాటు ఆయన చిన్న కూమార్తె తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు నవీద్ నివాసానికి చేరుకున్నారు.

# సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి: బొత్స


అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ



మాట్లాడుతూ... పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

## రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు..

(మొదటి పేజీ తరువాయి)



ఆహ్వానించనున్నారు.విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఢిల్లీ వెళుతున్నారు. ఈ మేరకు ప్రధానితో భేటీ అయి, ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కోరనున్నారు.ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా సీఎం చంద్రబాబు కలవనున్నారు. వీరితో పాటు కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్‌తో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఈ భేటీల్లో చర్చించే వీలుందని భావిస్తున్నారు.ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం, బుధవారం ఉదయం 7:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. రోజంతా అధికారిక సమావేశాల్లో పాల్గొని, రాత్రికి ఢిల్లీలోనే బస చేస్తారు. పర్యటన ముగించుకుని గురువారం ఉదయం 10:20 గంటలకు ఆయన తిరిగి రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు: హరీశ్ రావు


(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

## నేడు పొగాకు రైతులతో వైఎస్ జగన్ సమావేశం

వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. వారి తరఫున చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించనున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ




తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు.ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా, సుదర్శన్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారాంతం నాటికి జిల్లాల్లో ఓటర్ల గణన ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన ఓటర్లను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) తిరిగి భౌతిక పత్రాలు కోరకూడదని, అలాగే ఆధార్ కార్డుల కోసం ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణలో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఓటు యొక్క బాధ్యతను తెలియజేయాలని కోరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..

**కూకట్పల్లి (నేటి ప్రస్థానం )జూలై 21:** కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చందానగర్, మియాపూర్ హాఫీజ్ పేట.బిఆర్ఎస్ నాయకులు ,దీూా లతో టెలికాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా ూ×= కి సంబంధించి సమయం దగ్గర పడుతున్న వేళ ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా ఓటు రెండు ప్రాంతాల లో ఉన్న ఎడల వారికి తగిన విధంగా సూచనలు చేసి దరఖాస్తు నింపే ప్రక్రియ చేపట్టాలని కొంత మంది ప్రజలు అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు .అటువంటి వారికి దీూా,దీూా లు సందేహాలు నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఎట్టి పరిస్థితుల్లో ప్రజల ఓటు హక్కు కాపాడాల్సిన ఆవశ్యకత గుర్తు చేశారు ప్రజలు కూడా సామాజిక బాధ్యత గా సమయాన్ని కేటాయించి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు.ప్రజా ప్రతినిధులు కావాలంటే ఓటు ఎంతో ముఖ్యం అని దీనిపై నాయకులు కూడా దృష్టి సారించి చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలకు తెలియజేశారు.

## వరంగల్‌లో రూ.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు సీజ్

**వరంగల్:** నగరంలోని బంగారు ఆభరణాల దుకాణాల్లో బీఐఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిటీ నంబర్ లేకుండానే విక్రయాలు చేపడుతున్నట్లు గుర్తించి పలు ఆభరణాలను సీజ్ చేశారు. వివిధ దుకాణాల్లో రూ. 10కోట్ల విలువైన సుమారు 8 కిలోల బంగారు ఆభరణాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.

## ఆర్ఎస్‌కేలపై మంత్రి స్పష్టీకరణ: రైటర్లకు నష్టం ఉండదు

**అమరావతి:** రెవెన్యూ సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కేలు) ప్రవేశం ద్వారా ఎవరికీ నష్టం ఉండదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఎలాంటి ఇబ్బంది ఏర్పడదని హామీ ఇచ్చారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్‌కేలను టెక్నాలజీతో అనుసంధానం చేసి ప్రక్రియలను సులభతరం చేస్తామని మంత్రి తెలిపారు. బ్లాక్‌చైన్, డిజిటల్ లాకింగ్ వంటి ఆధునిక వ్యవస్థల ద్వారా మోసాలు, నకిలీలు నివారించి పారదర్శకతను నిర్ధారిస్తామన్నారు.

**ప్రైవేటైజేషన్ కాదు... సేవా మెరుగుదల మాత్రమే**

ఈ కేంద్రాలు ప్రైవేటైజేషన్ కిందకు వచ్చే అవకాశం లేదని, వీటిని ప్రజల సౌకర్యార్థం మాత్రమే ప్రారంభిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లోనూ, విదేశాల్లో కూడా ఇలాంటి సేవా కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నాయని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు తమ వృత్తిని కొనసాగించవచ్చని, వారి మార్గదర్శకత్వంలోనే పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సౌకర్యాల కొరత, సమస్యలను పరిష్కరించడం లక్ష్యమన్నారు. విపక్షాలు రాజకీయ లాభం కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. గతంలో వారు ఇలాంటి టెండర్లు ఇచ్చి మోసాలకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పైలట్ ప్రాతిపదికన జిల్లాల వారీగా ఒక్కొక్కటి మాత్రమే అమలు చేస్తూ ప్రజల అభిప్రాయాలు సేకరించి ముందుకు సాగుతుందని తెలిపారు.

## కాకినాడలో బాలకృష్ణకు ప్రమాదం

**ఫోన్‌లో పరామర్శించిన నారా లోకేష్**

**అమరావతి:** కాకినాడలో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గాయపడిన ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్పందించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆయన బాలకృష్ణకు ఫోన్ చేసి పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రమాదం ఎలా జరిగిందో, ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఎనగండ్ల పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



**సి.బెళగల్, జూలై 21:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎనగండ్లలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో-2 ఆదాం బాషా మంగళవారం పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన ఆయన పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా నిరంతరం చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

# కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

**ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు**

**వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య**

**బాధ్యతాయుత ప్రతిపక్షం కావాలి కానీ, నిరంతరం ఆందోళన చేసేది కాదంటూ హితవు**

కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు. సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పుదుచ్చేరి వంటి అనేక



రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

**క్వాష్ పిటిషన్‌తో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**

**తోటి మహిళా అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు**

**ఆరోపణలను ఖండించిన ఉదయ్ కృష్ణారెడ్డి**

**తమ మధ్య సమ్మతంతోనే సంబంధం ఉందని వాదన**

**బుధవారం హైకోర్టులో ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ**

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో, తీవ్ర వివాదంలో చిక్కుకున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టనుంది.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ూవూచీూూ)లో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డిపై ఓ ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి తీవ్ర ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని, అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, తనపై వివాహేతర సంబంధాలు అంటగడుతూ ప్రచారం చేయడం, ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వ్యక్తిగత సందేశాలు చూడటం, ప్రైవేట్ వీడియోలు



తీసి వాటిని తన భర్తకు పంపి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే, ఈ ఆరోపణలను ఉదయ్ కృష్ణారెడ్డి మొదటి నుంచి ఖండిస్తున్నారు. అవన్నీ నిరాధారమైనవని, తామిద్దరం పరస్పర అంగీకారంతో 2025 జూన్ నుంచి రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన వాదిస్తున్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా ఈ సంబంధం కొనసాగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ ఘటన తర్వాత ఆయన్ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్‌గా పనిచేసి, పట్టుదలతో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్ అధికారిగా ఎంపికైన స్ఫూర్తిదాయక నేపథ్యం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు దశలో ఉండగా, పోలీసులు ఇరువర్గాల వాదనలను, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది.

# మీర్‌పేట్‌లో దారుణం.. రౌడీ షీటర్ సూరి దారుణ హత్య

**పాత పగల నేపథ్యంలోనే జరిగిందని పోలీసుల అనుమానం**

**కళ్లలో కారం చల్లి, కత్తులతో దారుణంగా దాడి చేసిన ప్రత్యర్థులు**

**గతంలో బావమరిదిని హత్య చేసిన కేసులో సూరి నిందితుడు**

**ప్రధాన నిందితుడు అఫ్రోజ్ కోసం గాలిస్తున్న పోలీసులు**

హైదరాబాద్ నగరంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తీవ్ర కలకలం చోటుచేసుకుంది. పాత నేరస్థుడైన నందనవనం సూరిని ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా



నిర్ధారించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మీర్‌పేట్‌లోని టీకేఆర్ కళాశాల సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో సూరి చేతిలో హత్యకు గురైన వ్యక్తి సోదరుడు అఫ్రోజ్, పక్కా పథకం ప్రకారం సూరిని అక్కడికి రప్పించాడు. సూరి రాగానే, దుండగులు తొలుత అతని కళ్లలో కారం పొడి చల్లి ప్రతిఘటించకుండా చేశారు. అనంతరం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో సూరి అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడు సూరిపై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. తన భార్యతో పాటు బావమరిది సల్మాన్‌ను హత్య చేసిన కేసులో అతను ప్రధాన నిందితుడు. అతని నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు కొన్ని నెలల క్రితమే అతడిని నగరం నుంచి బహిష్కరించారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత కక్షల కారణంగా ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు ఈ దాడిలో పాల్గొన్న ఇతర వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలిస్తున్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## అన్నారం 261 భూ వ్యవహారంలో సంచలన పరిణామం

### చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గం కలెక్టర్‌కు ఫిర్యాదు -- సమగ్ర విచారణకు విజ్ఞప్తి

**గుమ్మడిదల మున్సిపల్:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని అన్నారం గ్రామ సర్వే నంబర్--261 భూ వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఇప్పటివరకు ఈ అంశంపై 13 మంది కౌన్సిలర్లు మాత్రమే పోరాటం సాగించగా, తాజాగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మొత్తం పాలకవర్గం రంగంలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.సర్వే నంబర్--261లో భూ అక్రమాలు, కబ్జాలు, రికార్డులలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అన్నారం 261 భూ వివాదం ఇప్పటికే స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు పాలకవర్గం మొత్తం ఒకే స్వరంతో ఫిర్యాదు చేయడం ఈ వ్యవహారాన్ని మరింత ప్రాధాన్యత కలిగిన అంశంగా మార్చింది. ఈ ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశంపై స్థానిక ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాలని, ప్రభుత్వ భూములు ప్రజల హక్కులకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ కు వినతి

### అపార్ట్మెంట్ నిర్మాణం నిలిపివేయాలని వీధి, దీపాలు, రోడ్లు డ్రైనేజ్ ,సమస్యలు పరిష్కరించాలని ఈర్ల రాజు డిమాండ్



**అమీన్పూర్ డివిజన్:** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట్ కాలనీల ప్రజా సమస్యల పరిష్కారం కోసం అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బిహెచ్ఎల్ మెట్రో కాలనీలోని రోడ్ నెం.11లో నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్న బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ పనులను వెంటనే నిలిపివేయాలని కోరారు. కాలనీలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.అపార్ట్‌మెంట్‌కు వెళ్లే మార్గం కేవలం 20 అడుగుల రహదారి మాత్రమే ఉండటంతో అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. అన్ని అనుమతులను పరిశీలించి విచారణ పూర్తయ్యే వరకు నిర్మాణాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఇందిరమ్మ కాలనీ 12వ చౌరస్తా నుంచి బిహెచ్ఎల్ మెట్రో కాలనీ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిహెచ్ఎల్ మెట్రో సొసైటీ ప్రతినిధులు, కాలనీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## బద్వేల్ నాలుగు రోడ్ల కూడలిలో లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

### రోడ్డు భద్రతపై నిర్లక్ష్యం వీడాలని ప్రజలకు విజ్ఞప్తి



బద్వేల్: బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రహదారిని దాటుతున్న ఓ వృద్ధుడు లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఆయనను బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటన మరోసారి రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అవసరాన్ని గుర్తు చేసింది. రహదారిని దాటే ముందు ఇరువైపులా వాహనాలు వస్తున్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు వేగాన్ని నియంత్రించి, పాదచారులకు దారి ఇవ్వడం తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని స్థానికులు సూచిస్తున్నారు.బద్వేల్ నాలుగు రోడ్ల కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ప్రజల ఉసురుపోసుకున్నవాళ్లు చరిత్రలో బాగుపడ్డట్టు లేదు

### రైతుల కంట కన్నీరు ఊరికే పోదు

### ఎల్నినోలు ఎన్నొచ్చినా తట్టుకునే విధంగా కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది

### అబద్ధపు ప్రచారాలతో రేవంత్ ప్రభుత్వం పబ్బం గడుపుతుంది

### రాసి పెట్టుకోండి కేసీఆర్ ప్రభుత్వం మళ్ళీ వస్తుంది

### మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత

### బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



**లక్షెటిపేట:** ప్రజల ఉసురుపోసుకున్నవాళ్లు చరిత్రలో బాగుపడ్డట్టు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలం లోని అంకతిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదన్నారు. రాష్ట్రానికి ఎల్నినో ప్రభావం చేసిన నష్టం కంటే కాంగ్రెస్ చేసిన నష్టమే ఎక్కువన్నారు. కన్నెపల్లి లో ఉన్న వాటర్ ను రోజుకు మూడు టీఎంసీ ల చొప్పున అన్నారం, సుందిల్లా, ఎల్లంపల్లి బ్యారేజ్ లకు బ్యాక్ వాటర్ ఎందుకు పంపడలేదు అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు?. ఒక్క ఎల్నినో కాదు ఇంకొక ఎల్నినో వచ్చిన మన రాష్ట్రానికి కరువు రాకుండా బ్యారేజ్ లు కట్టి బాహుబలి మోటార్లు పెట్టించిన ఘనత మన కేసీఆర్ దేనని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కెసిఆర్ కంటే ఎక్కువ ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి నాలుగు సార్లు ఎగొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని ఏద్దేవా చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇలా ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కాడన్నారు. కాళేశ్వరంపై రేవంత్ రెండు పిల్లర్స్ దెబ్బతిన్నాయని చెప్పి,32 నెలలుగా ఎందుకు రిపేర్ చేయించలేదని ప్రశ్నించారు?. కాళేశ్వరం ప్రాజెక్టు మీద బూటకపు ప్రచారాలు చేస్తూ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. 32 నెలలు గడచిన ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు?. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన పద్దతిని మార్చుకోవాలని హెచ్చరించారు. నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలే కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. అదేవిధంగా అకాల వర్షానికి గోడలు కూలి రైతులు మరణిస్తే రెండున్నర నెలలు గడచినా వారికీ ఎలాంటి సహాయం అందలేదని బాధను వ్యక్తం చేశారు. చివరికి కే సీ ఆర్ ప్రవేశపెట్టిన రైతుభీమా ద్వారా ఒక్క రైతు కుటుంబానికి మాత్రమే రూ. 5లక్షలు అందాయన్నారు. మరణించిన నలుగురు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చెక్కులను కే టీ ఆర్ అందజేశారు. రైతులు చనిపోతున్న రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదా అని ప్రశ్నించారు?. ఇంకొక్క 28 నెలల్లో కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని రైతులను పట్టించుకోని ప్రభుత్వం పడిపోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకె రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, రాష్ట్ర నాయకులు విజిత్ రావు, మాజీ డీసీఎమ్మెస్ తిప్పని లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లు ఎల్తాపు సుధాకర్, మాజీ సర్పంచ్ సొల్లు సురేష్, మాజీ యూత్ అధ్యక్షులు మారిశెట్టి సుమన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

### సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

### పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

### జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్



**మెదక్ జిల్లా నర్సాపూర్:** మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ రికార్డులు, ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు (వీపీఓలు) తమ పరిధిలోని గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, బ్యాంకింగ్ మోసాలు, ఫేక్ లింకుల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టాలని ఎస్పీ సూచించారు. దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వ్యాపారులు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను గుర్తించేందుకు, నేరాల దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, ఎస్ఐలు రంజిత్ రెడ్డి, జగన్మోహన్, కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు..!

### అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం..!.. ప్రజల సొమ్ముతో చేసే పనుల్లో అవినీతి, నిర్లక్ష్యం సహించేది లేదు..!

### ప్రమాణాలు పాటించకపోతే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నేరుగా ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు** రూ.1,200 కోట్ల భారీ వ్యయంతో మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి--65 విస్తరణ పనుల్లో జరుగుతున్న తీవ్ర నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలపై పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను కొందరు కాంట్రాక్టర్లు తమ స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మార్చుకున్నారని మండిప డ్డారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరులోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి రుద్రారం గణేష్ గడ్డ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారని ఆయన ఆరోపించారు. నిర్మించిన కొద్ది రోజులకే సర్వీస్ రోడ్లు దెబ్బతినడం, వర్షపు నీటి కాలువలు కూలిపోవడం అధికారుల పర్యవేక్షణ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రహదారి విస్తరణలో వెలికితీసిన విలువైన మట్టిని ప్రజా అవసరాలకు వినియోగించకుండా ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు ఆ మట్టిని అందించాలని ఎన్నిసార్లు కోరినా స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. రహదారి విస్తరణలో తొలగించిన మహనీయుల విగ్రహాలను పటాన్చెరు సాకి చెరువు కట్టపై ప్రతిష్ఠించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించు కోకపోవడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. ఇప్పటివరకు 20 సార్లకు పైగా సమీక్ష సమావేశాలు నిర్వహించినా పనుల్లో ఎలాంటి మార్పు కనిపించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంట్రాక్టర్లు, అధికారులు వెంటనే తమ పనితీరును మార్చుకుని నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేకపోతే ప్రజల తరఫున కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తానని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డీఈ సందీప్, కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం: రఘునందన్ రావు

**నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై సీబీఐ దర్యాప్తు వేగంగా జరుగుతోందన్న రఘునందన్ రావు**

**ఈ అంశంపై పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని వెల్లడి**

**విపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపాటు**



నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరమని, అయితే ఈ అంశంపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నీట్‌తో పాటు ఏ ప్రజా సమస్యపై అయినా పార్లమెంట్‌లో సమగ్రమైన సమాధానం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే పార్లమెంట్ సమావేశాలు కేవలం నిబంధనల ప్రకారమే సాగుతాయని, విపక్షాల ఆలోచనలకు అనుగుణంగా జరగవని తేల్చిచెప్పారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసి ఫొటోలు దిగాలనే ఉద్దేశంతోనే విపక్షాలు సభను వాయిదా వేయిస్తున్నాయని ఆయన విమర్శించారు. సభా నిబంధనల ప్రకారం నీట్ అంశంపై చర్చించేందుకు స్పీకర్ అంగీకరించినప్పటికీ, జీరో అవర్‌ను రద్దు చేసి ఇప్పుడే చర్చ పెట్టాలంటూ విపక్షాలు పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇప్పటికే నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించామని గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చట్టసభను ముట్టడిస్తామంటే ఏ ప్రభుత్వమైనా భద్రత దృష్ట్యా నిరసనకారులను అడ్డుకుంటుందని, దానిని వివాదం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. అలాగే అయోధ్య విరాళాల చోరీ ఉదంతంతో బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఈ చోరీ కేసుపై సిట్ లోతుగా విచారణ జరుపుతోందని తెలిపారు. ఆలయంలో పనిచేసే ఒక వ్యక్తి దురాశతో చేసిన తప్పును తీసుకొచ్చి ఒక పార్టీకి ఆపాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు రాబోతున్నందునే, రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు బీజేపీపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా బొల్లారం వెంకట్‌రెడ్డి

**పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు.**

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్న నూతన అధ్యక్షులు వెంకట్ రెడ్డి.**

**ఎమ్మెల్యే యాదయ్య కు ధన్యవాదములు :వెంకట్ రెడ్డి.**



**శంకర్ పల్లి: జూలై 21:** చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పొద్దుటూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బొల్లారం వెంకట్‌రెడ్డిని నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అండదండలతో పాటు పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, సుదీర్ఘ రాజకీయ అనుభవం, కార్యకర్తలతో ఉన్న అనుబంధాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. బొల్లారం వెంకట్‌రెడ్డి గతంలో పొద్దుటూరు గ్రామ ఎంపీటీసీగా ప్రజలకు సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అనంతరం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గ్రామీణ స్థాయిలో పార్టీనిస్త్ర బలోపేతం చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. వెంకట్‌రెడ్డి కుటుంబానికి కూడా ప్రజాసేవలో విశేష అనుభవం ఉంది. ఆయన సతీమణి బొల్లారం ప్రవళిక వెంకట్‌రెడ్డి ఎంపీటీసీగా, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేయగా, ఆయన మాతృమూర్తి గ్రామ సర్పంచిగా సేవలందించారు. దీంతో ప్రజాసేవ, రాజకీయాల పట్ల అంకితభావం కలిగిన కుటుంబంగా బొల్లారం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన చేవెళ్ల నియోజకవర్గ కమిటీలలో భాగంగా శంకర్‌పల్లి మండల అధ్యక్ష పదవికి వెంకట్‌రెడ్డి ఎంపిక కావడం మండల కాంగ్రెస్



శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఆయన నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. శంకర్‌పల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తానని అన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సంక్షేమం, సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యకు, అలాగే తన నియామకానికి సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కృషి చేస్తానని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే తన తండ్రికి ఉన్న మంచి పేరుకు తోడుగా గ్రామం లో విద్య, వైద్య సేవలకు స్వంత నిధులు వెచ్చించి సేవలాందించారు. దాంతో పాటు యువత సంక్షేమము కోసం, పేదల అభివృద్ధికి విశేషంగా పనిచేసిన అనుభవం వెంకట్ రెడ్డి కి ఉంది.

# పోలీసుల సంక్షేమమే తొలి ప్రాధాన్యత

**స్కాలర్‌షిప్‌లు, జేఈఈ--నీట్ కోచింగ్, రూ.30 లక్షల వరకు తక్కువ వడ్డీ రుణాలు -- డిజిటల్ వెల్ఫేర్ వ్యవస్థకు శ్రీకారం**

**14 ఏళ్ల తర్వాత పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు**

**పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, భద్రత--ఆరోగ్య భద్రత విభాగాల సమీక్షలో డీజీపీ సి. వి. ఆనంద్**




**రాజేంద్ర నగర్ , జూలై 21 :** తెలంగాణ రాష్ట్ర పోలీసు సిబ్బంది సంక్షేమమే తన అత్యున్నత ప్రాధాన్యత అని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. విధినిర్వహణలో పోలీసులు తీవ్ర ఒత్తిడి, అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నందున వారి సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంగళవారం పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, భద్రత మరియు ఆరోగ్య భద్రత (ఆరోగ్య రక్షణ) విభాగాల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ప్రతిభావంతులైన పిల్లలకు స్కాలర్‌షిప్‌లను పెంచడంతో పాటు జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందించనున్నట్లు ప్రకటించారు. అలాగే వివాహ, వైద్య, విద్యా అవసరాల కోసం మరిన్ని రుణాలు, కార్పస్ ఇన్సూరెన్స్, గ్రాంట్ ఆధారిత ఆర్థిక సహాయాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. కొత్తగా అమల్లోకి వచ్చిన ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ (జుహా)లో ఆరోగ్య భద్రత పథకం విలీనం అయినట్లు తెలిపారు. ఈ పథకం కింద 2025లో మొత్తం 33,126 మంది లబ్ధిదారులు చికిత్స పొందగా రూ.181.74 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 2026 జూన్ వరకు 12,392 మంది చికిత్స పొందగా రూ.73.61 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.5 లక్షల నుంచి ఐపీఎస్ అధికారులకు రూ.25 లక్షల వరకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు అలాగే పోలీస్ క్యాంటీన్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆసరా కార్యక్రమం, పోలీసు పిల్లల విద్య, పోటీ పరీక్షల కోచింగ్, వివాహ సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడానికి డీజీపీ కార్యాలయం నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అన్ని రికార్డులను డిజిటలైజ్ చేసి రియల్‌టైమ్ పర్యవేక్షణకు వీలుగా డిజిటల్ వెల్ఫేర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పోలీసు ఉద్యోగికి గృహ, వ్యక్తిగత, వివాహ, విద్యా అవసరాల కోసం రూ.30 లక్షల వరకు తక్కువ వడ్డీ రుణాలు అందించేలా పోలీస్ వెల్ఫేర్ సొసైటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిధులలో ప్రతి రూపాయి అర్హులైన ఉద్యోగికి న్యాయంగా, పారదర్శకంగా చేరేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే 14 సంవత్సరాల తర్వాత పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సంఘం పనిచేయడం వల్ల పోలీసు సిబ్బంది సంక్షేమం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లాల పర్యటనలో పోలీస్ స్టేషన్ల నిర్వహణ ఖర్చులు, ఇతర సాధారణ వ్యయాలకు గత ఏడాది మొత్తం నిధులు విడుదల కాలేదని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఆర్థిక శాఖతో చర్చించి పెండింగ్ బిల్లులకు ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీంతో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆర్థిక భారం తగ్గి మరింత సమర్థవంతంగా సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.




# నిరసనల మధ్య బర్గర్ వివాదం..

**అధికార ప్రతినిధిపై కాక్రోచ్ జనతా పార్టీ వేటు**

**కాక్రోచ్ జనతా పార్టీ అధికార పదవి నుంచి విజేత దహియా తొలగింపు**

**నిరసనల మధ్య అసందర్భంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై చర్యలు**

సహచరులు దీక్షలో ఉండగా బర్గర్ తింటున్న వీడియో వైరల్ కావడంతో వివాదంయువజన ఉద్యమ పార్టీగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), తమ అధికార ప్రతినిధి విజేత దహియాపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆయన ప్రవర్తన తీవ్ర వివాదాస్పదం కావడంతో, పార్టీ ఆయనపై వేటు వేస్తూ మంగళవారం నిర్ణయం తీసుకుంది. దహియాను తక్షణమే అన్ని అధికారిక బాధ్యతల నుండి తొలగిస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. 'నీట్' పరీక్షల్లో నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై జవాబుదారీతనం వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్ వంటి ప్రముఖులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, అదే నిరసన స్థలికి సమీపంలో దహియా బర్గర్ తింటూ కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై వివరణ కోరగా, తాను ఎన్నికైన ప్రతినిధిని కానని, కేవలం స్వచ్ఛందంగానే ఉద్యమంలో పాల్గొంటున్నానని, తానెవరికీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆయన సమాధానమివ్వడం మరింత వివాదానికి దారితీసింది. ఈ ఉదంతంపై సీజేపీ నాయకత్వం తీవ్రంగా స్పందించింది. దహియా ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, అది పార్టీ విలువలకు, ఉద్యమ సిద్ధాంతాలకు విరుద్ధమని 'ఎక్స్' వేదికగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం ఆయనలో పూర్తిగా లోపించిందని పార్టీ ఘాటుగా వ్యాఖ్యానించింది.

## మరకత శివాలయంలో ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు

**శంకర్ పల్లి: జూలై 21:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మరకత శివాలయంలో మంగళవారం ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి, వైస్ చైర్మన్ నర్సింలు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి శివ, కమిటీ సభ్యులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మడపతి చంద్రమౌళి..


**శంకర్ పల్లి: జూలై 21:** శంకర్ పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మాజీ కౌన్సిలర్ మడపతి చంద్రమౌళి నియమితులైనారు. ఈ సందర్భంగా మంగళవారం 9వ వార్డు కౌన్సిలర్ గణేష్, శంకర్ పల్లి ఏఎంసి డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, నాయకులు రఘునందన్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, ఎం సి ఎం యువసేన సభ్యులు జంగం బిక్షపతి, మహేష్, మడపతి మణికంఠ, చాకలి రాజు, జంగం శ్రీనివాస్ లు శాలువాతో సత్కరించి సన్మానించారు.

## కూసుమంచి ఏడిఏగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్

**కూసుమంచి, జూలై 21:** కూసుమంచి డివిజన్ ఏడిఏగా రాజేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంచార్జ్ ఏడిఏ సతీష్ ఎఫ్టీసీకి వెళ్లారు,బాధ్యతలు స్వీకరించిన ఏడిఏను డివిజన్లోని నాలుగు మండలాల ఏవోలు వాణి,రాధ,సీతారాంరెడ్డి,నగేష్,డివిజన్ ఏఈవోలు,ఏడిఏ ఆఫీస్ సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి,శాలువాలు కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూసుమంచి డివిజన్లోని నాలుగు మండలాల రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## బండారుపల్లి కాంతయ్యకి నివాళులు అర్పించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

**కూసుమంచి, జూలై 21:** ఖమ్మం జిల్లా, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో మంగళవారం మరణించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారుపల్లి కాంతయ్య మరణం పట్ల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరా వు,సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సంతాపం తెలిపారు. వారి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుం బానికి ప్రగాఢ సానుభూ తిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి ఆఫీసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



# పునరుత్పాదక ఇంధన రంగంలోకి భారీ పెట్టుబడులు

**ఐదేళ్లలో రూ.11.52 లక్షల కోట్లు**

**భూ సమీకరణకే రూ.1.44 లక్షల కోట్లు**


**కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా**

న్యూఢిల్లీ: దేశ పునరుత్పాదక ఇంధన రంగం (సోలార్, పవన విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపన) పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించనుంది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలోకి 110--120 బిలియన్ డాలర్ల (రూ.11.52 లక్షల కోట్లు) మేర పెట్టుబడులు రానున్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా వెల్లడించింది. 7 లక్షల ఎకరాల భూ సమీకరణ కోసమే సుమారు 10--15 బిలియన్ డాలర్ల (రూ.96,000--1,44,000 కోట్లు) పెట్టుబడులు అవసరమని తెలిపింది. 2025 చివరికి పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపిత సామర్థ్యం 250 గిగావాట్లకు చేరుకున్నట్టు తెలిపింది. 2015 నాటికి ఉన్న 80 గిగావాట్లతో పోలి?చతే మూడు రెట్లు పెరిగినట్టు వెల్లడించింది. 2026 మార్చి నాటికి స్థాపిత సామర్థ్యం 275 గిగావాట్లకు చేరినట్టు పేర్కొంది. 2030 నాటికి 270--300 గిగావాట్ల సోలార్, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యం అదనంగా తోడు కానున్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా వేసింది. 2026--2030 కాలంలో 6.5 లక్షల ఎకరాలు ఒక్క సోలార్ ఇన్‌స్టాలేషన్లకే అవసరమవుతుందని.. మిగిలిన 50వేల ఎకరాలు పవన విద్యుత్‌కు కావాల్సి వస్తుందని పేర్కొంది.



**500 మెగావాట్ల లక్ష్యం సాధ్యమే**

సోలార్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటు కోసం ఒక్కో మెగావాట్‌కు రూ.3--4 కోట్లు, పవన విద్యుత్ ప్రాజెక్ట్‌ల (భూమిపై)కు సంబంధించి ఒక మెగావాట్ సామర్థ్యం కోసం రూ.8--9 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుందని కొలియర్స్ ఇండియా తెలిపింది. దేశీయంగా తయారీ సామర్థ్యాలు మరింత మెరుగుపడుతున్నందున 2030 నాటికి భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని సులభంగానే చేరుకుంటుందని భావిస్తున్నట్టు పేర్కొంది. అప్పటికి ఒక్క సోలార్ ప్రాజెక్టుల సామర్థ్యమే 400--450 గిగావాట్ల మేర ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం 146 గిగావాట్ల సామర్థ్యం మేర ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతున్నట్టు తెలిపింది. పునరుత్పాదక విద్యుత్ రంగం శరవేగంగా విస్తరిస్తుండడం రియల్ ఎస్టేట్ రంగానికి అవకాశాలు కలి?పస్తుందని.. ముఖ్యంగా భూ సమీకరణ, పునరుత్పాదక ఆధారిత పారిశ్రామిక పార్కుల్లో అవకాశాలు ఉంటాయని అంచనా వేసింది.




## ఉద్యోగుల పొట్టకొడుతున్న ఏఐ!

వ్యాపార రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) వేగవంతమైన మార్పులు తెస్తోంది. ఈ నేపథ్యంలో అనేక సంస్థలు ఏఐలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అమెరికాకు చెందిన క్లౌడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ టెరాడేటా (ఎవతీఘుఝ్ఘు) కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తోంది. సంస్థలో పనిచేస్తున్న సుమారు 5,100 మంది ఉద్యోగులకు 2026 సంవత్సరంలో వార్షిక జీతాల పెంపు ఉండబోదని యాజమాన్యం ప్రకటించింది. టెరాడేటా సంస్థ సీఈఓ స్టీవ్ మెక్‌మిలన్ ఉద్యోగులకు పంపిన మెమోలో, 2026 సంవత్సరానికి కంపెనీ ప్రధాన లక్ష్యం.. ఏఐ రంగంలో విజయాన్ని సాధించడం అని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతిభావంతులైన ఉద్యోగులను నియమించుకోవడం, ఏఐ సామర్థ్యాలను పెంచుకోవడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై పెట్టుబడులు పెట్టడం అవసరమని వివరించారు. ఈ పెట్టుబడులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు వార్షిక జీతాల పెంపు కోసం కేటాయించిన బడ్జెట్‌ను ఏఐ అభివృద్ధికి మళ్లిస్తున్నట్లు తెలిపారు.సాధారణంగా.. కంపెనీలో ఉద్యోగులకు ప్రతి సంవత్సరం 2 నుంచి 4 శాతం వరకు జీతాల పెంపు ఉండేది. అయితే ఈసారి ఆ పెంపులను పూర్తిగా నిలిపివేశారు. అయినప్పటికీ ఉద్యోగుల కోసం అన్ని రకాల ప్రయోజనాలను రద్దు చేయలేదని సంస్థ స్పష్టం చేసింది. పర్ఫామెన్స్ బేస్డ్ బోనస్‌లు, షేర్ల రూపంలో ఇచ్చే ఈక్విటీ ఆధారిత ప్రోత్సాహకాలు కొనసాగుతాయని తెలిపింది.టెరాడేటా మాత్రమే కాకుండా.. మరో టెక్ కంపెనీ టీటీఈసీ కూడా అమెరికాలోని ఉద్యోగుల రిటైర్మెంట్ కంట్రిబ్యూషన్ ప్రయోజనాలను 2026 వరకు నిలిపివేసింది. ఆ నిధులను ఏఐ టూల్స్, ఉద్యోగుల శిక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉద్యోగుల తొలగింపులుపై ప్రభావం చూపిన ఏఐ, ఇప్పుడు జీతాలపైనా కూడా ప్రభావం చూపుతోంది.

## భారత ఆర్థిక వ్యవస్థ భేష్





ముంబై: రాజకీయ, భౌగోళిక సవాళ్ల నేపథ్యంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడను చూపుతున్నట్లు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ జే. స్వామినాథన్ ఇటీవల పేర్కొన్నారు. ఇందుకు పారిశ్రామిక, సర?వసుల రంగాలు దన్నుగా నిలుస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా విస్తృత డిమాండ్, మెరుగుపడుతున్న కార్పొరేట్ ఫలితాలు తదితర అంశాలు వ్యవస్థ ప్రగతిశీలతకు మద్దతిస్తున్నట్లు వివరించారు. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత పరిధిలోనే ఉన్నట్లు కొలంబియా యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్(ఎస్ఐపీఏ) వద్ద ప్రసంగంలో సోమవారం ప్రస్తావించారు. విదేశీ ఆటుపోట్లను తట్టుకోగలమని ఈ సందర్భంగా తెలియజేశారు. జియోపాలిటిక్స్, వాతావరణ మార్పులు, ఏఐ, టెక్నాలజీ సవాళ్లపై ప్రపంచ పాలసీలు ఆధారపడుతున్న సందర్భంలో సమావేశంకానున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రసంగాన్ని ఆర్‌బీఐ తాజాగా వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసింది.

## భారత్ ఆరోగ్య స్కోరు ఏ 65

**మణిపాల్ సిగ్నా ఇండియా హెల్త్ కోషంట్‌లో వెల్లడి**

**అన్నింటికంటే వెనుకబడిన ఆర్థిక ఆరోగ్యం**



ముంబై: దేశీయంగా ప్రజలు తమ శారీరక, మానసిక, ఆర్థిక ఆరోగ్యంతో పాటు ఉద్యోగాలు, బంధాలు మొదలైన వాటన్నింటినీ సమన్వయం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. శారీరక, మానసిక, ఆర్థిక, వృత్తి, సామాజికం అనే ఐదు అంశాలపై మణిపాల్ సిగ్నా ఇండియా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇందుకు సంబంధించిన హెల్త్ కోషంట్ 2026లో ప్రజల సమగ్ర ఆరోగ్య స్కోరు 100కి గాను 65గా నమోదైనట్లు సంస్థ వెల్లడించింది. శారీరక ఆరోగ్యం అత్యధికంగా 68 స్కోరు సాధించగా, ఆర్థిక ఆరోగ్యం 62 స్కోరుతో అన్నింటికంటే వెనుకబడింది. పట్టణ ప్రాంత భారతీయుల్లో 82 శాతం మంది ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ, కేవలం ఒక శాతం మంది మాత్రమే తమ ఆరోగ్యం బాగోలేదని అభిప్రాయపడ్డారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేథ వాడకంపై 63 శాతం మంది సానుకూలంగా ఉన్నప్పటికీ, అది వైద్యులకు సహాయకారిగా ఉండాలే తప్ప మానవ మేథస్సు స్థానాన్ని ఆక్రమించేదిగా ఉండకూడదని చెప్పారు. ప్రజలు చికిత్స ఎలా అందుతుందని ఆందోళన చెందడం కాకుండా తాము ఆరోగ్యంగా ఎలా ఉండాలనే దానిపై దృష్టి పెడుతున్నారని సంస్థ ఎండీ జాయ్‌దీప్ సాహా తెలిపారు.



## వెండి హాల్‌మార్కింగ్ సవాళ్లపై అధ్యయనం

న్యూఢిల్లీ: వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ నిబంధనలను తప్పనిసరి చేసేందుకు మౌలిక సదుపాయాల సన్నద్ధతకు సంబంధించిన సవాళ్లను అధ్యయనం చేస్తున్నట్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గర్గ్ తెలిపారు. జ్యుయలరీ, కళాకృతులు, ఫర్నిచర్ తదితర రూపాల్లో కూడా వెండిని చాలా స్టోర్స్‌లో విక్రయిస్తారు కాబట్టి మార్కెట్‌పరంగా చూసినప్పుడు పసిడితో పోలిస్తే సిల్వర్ హాల్‌మార్కింగ్ చాలా సంక్లిష్టంగా ఉంటుందని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. బీఐఎస్‌లో మొత్తం హాల్‌మార్కింగ్ కార్యకలాపాలను కేవలం అయిదుగురు మాత్రమే పర్యవేక్షిస్తుంటారని, మిగతా సిబ్బంది అంతా ప్రైవేట్ లేదా ఔట్‌సోర్సింగ్ వారే అయి ఉంటారని గర్గ్ చెప్పారు. ప్రైవేట్ వర్గాల సహాయంతో హాల్‌మార్కింగ్ సెంటర్లను నిర్వహించడం, నమ్మకాన్ని చూరగొనడం అనేది చాలా కష్టతరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తప్పనిసరి సిల్వర్ హాల్‌మార్కింగ్‌ని క్రమంగా అమల్లోకి తేనున్నట్లు గర్గ్ చెప్పారు. 2005 నుంచి వెండికి హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా అమలవుతోంది. 2025 సెప్టెంబర్ నుంచి సిల్వర్ ఆర్టికల్స్ స్వచ్ఛతకు సంబంధించి హాల్‌మార్క్ విశిష్ట గుర్తింపు (యూహెచ్ఐడీ) సంఖ్యను అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం వెండి ఆభరణాలను పరీక్షించేందుకు బీఐఎస్ గుర్తింపు పొందిన అసేయింగ్, హాల్‌మార్కింగ్ సెంటర్లు (ఏహెచ్‌సీ) సుమారు 230 ఉన్నాయి.

## ప్రయోగం నుంచి వినియోగం వైపు




న్యూఢిల్లీ: దేశీ ఐటీ పరిశ్రమ కృత్రిమ మేథ (ఏఐ) ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా పరీక్షించే దశ నుంచి క్రమంగా విస్తృతంగా వినియోగించే దశ వైపు మళ్లుతున్నాయి. సంస్థాగతంగా కార్యకలాపాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏఐ ఏజెంట్లను అనుసంధానం చేసుకుంటున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో దేశీ ఐటీ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో సంస్థలు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ వినియోగాన్ని మూడు లక్షల మందికి పైగా ఉద్యోగులకు అందుబాటులోకి త్చాయి. తద్వారా అంతర్జాతీయంగా భారీ స్థాయిలో ఏఐని వినియోగిస్తున్న దిగ్గజాల సరసన చేరాయి. భారత్‌లో గణనీయంగా సిబ్బంది ఉన్న యాక్సెంచర్ కూడా వేల కొద్దీ ఉద్యోగులకు కోపైలట్‌ని అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ చేపట్టింది.'రోజువారీ ఉత్పాదకతను పెంచుకునేందుకు, కలిసి పనిచేయడాన్ని ప్రోత్సహించేందుకు, తెలివిగా నిర్ణయాలను తీసుకోవడంలోను తోడ్పడేందుకు మేము 1,00,000 మంది సిబ్బందికి మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌ని అందుబాటులోకి తెచ్చాం' అని టీసీఎస్ సీఈవో కె. కృతివాసన్ తెలిపారు. సంస్థ రోజువారీ కార్యకలాపాల్లో టెక్నాలజీని భారీగా వినియోగించడం ద్వారా అవకాశాలను మరింతగా అందిపుచ్చుకోవచ్చని ఇన్ఫోసిస్ సీఈవో సలిల్ పరేఖ్ తెలిపారు. ఏఐని తాము రోజువారీ పనుల్లో అనుసంధానిస్తున్నామని, తద్వారా ఉత్పాదకతను పెంచుకోవడం, నిర్ణయాలను పక్కాగా అమలుచేయడం, ఆవిష్కరణలను వేగవంతం చేయడంలాంటి అంశాలకు ఏఐ ఉపయోగపడుతుందని విప్రో సీఈవో శ్రీని పల్లియా తెలిపారు.

**కలిసి పని చేసే హైబ్రిడ్ విధానం..**

ఏఐ కార్యకలాపాలను కేవలం స్టాండెలోన్ సాధనాలుగా కాకుండా మనుషులు, ఏజెంట్లు కలిసి పని చేసే విధానంగా తీర్చిదిద్దుకోవడంపై కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్‌కి చెందిన వర్క్ ట్రెండ్స్ ఇండెక్స్ 2026 ప్రకారం ఈ తరహా ఏఐ వినియోగం .. ప్రాథమిక ఆటోమేషన్ పరిధిని దాటి విశ్లేషణ, సమస్యల పరిష్కారంలాంటి పనులను సులభతరం చేస్తోంది. కంపెనీవ్యాప్తంగా ఏఐని ఉపయోగించడం వల్ల దేశీ ఐటీ దిగ్గజాలకు భారీగా ఆదా అవుతోంది.

# భారత్ వృద్ధి అంచనా 6.4 శాతానికి కట్

**గత అంచనా 6.6 శాతం**

**అయినా వేగవంతమైన ఆర్థిక వ్యవస్థే**


**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పశ్చిమాసియా షాక్**

**ఐక్యరాజ్య సమితి నివేదిక**

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో 2026 సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి రేటు అంచనాను ఐక్యరాజ్యసమితి (యూఎన్) స్వల్పంగా తగ్గించింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో గత అంచనా 6.6 శాతాన్ని 6.4 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది.

**పశ్చిమాసియా సంక్షోభం**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పశ్చిమాసియా సంక్షోభం మరో షాక్‌గా ఈ నివేదిక అభివరి?ణంచింది. ఇది




ప్రపంచ వృద్ధిని మందగింపజేయడంతోపాటు, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లను, అనిశ్చితులను పెంచినట్టు వివరించింది. ప్రస్తుత ప్రపంచ ప్రతికూల సవాళ్ల నుంచి భారత్‌కూ మినహాయింపు లేదని యూఎన్ గ్లోబల్ ఎకనామిక్ మానిటరింగ్ విభాగం సీనియర్ ఆర్థికవేత్త ఇంగో పిట్టర్లే వ్యాఖ్యానించారు. "భారత్ ఇంధనాన్ని భారీగా దిగుమతి చేసుకుంటోంది. విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌లపై ప్రభావం తదతర ఒత్తిళ్లు సైతం నెలకొన్నాయి. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితుల కఠినతరంతో మానిటరీ పాలసీ మరింత సంక్లిష్టంగా మారింది" అని పిట్టర్లే వివరించారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ, ఆర్థిక శాఖ ఎలా స్పందిస్తాయన్నదే కీలకమన్నారు.

**ప్రపంచ జీడీపీ వృద్ధి అంచనా సైతం తగ్గింపు**

2026 సంవత్సరానికి గాను ప్రపంచ స్థూల జీడీపీ వృద్ధి రేటు అంచనాను సైతం 2.5 శాతానికి యూఎన్ తగ్గించింది. జనవరిలో వేసిన అంచనా కంటే 0.2 శాతం తక్కువ కావడం గమనార్హం. అంతేకాదు, కరోనా మహమ్మారికి ముందున్న సాధారణ వృద్ధి రేటు కంటే ఇది చాలా తక్కువని ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ వృద్ధి 2025లో ఉన్న 7.5 శాతం నుంచి 2026లో 6.4 శాతం తగ్గడమన్నది ప్రధానంగా ఇంధన దిగుమతి వ్యయాలు పెరిగిపోవడం వల్లేనంటూ.. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. దేశీయంగా వినియోగ డిమాండ్, ప్రభుత్వ మూలధన వ్యయాలు, సేవల రంగ ఎగుమతుల్లో చక్కని పనితీరు కారణంగా భారతదేశంలో నిర్మాణాత్మకంగా బలమైన వృద్ధి కనిపిస్తున్నట్టు పేర్కొంది. తిరిగి 2027 సంవత్సరంలో ఆర్థిక వృద్ధి రేటు 6.6 శాతానికి పుంజుకుంటుందని అంచనా వేసింది.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక




# ఇన్‌స్టాలో సమ్ముర్రేపిన ఫౌజీ

## ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్

రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ గ్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో


## ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్దం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రెగ్నెన్సీతోనే రాకా షూట్‌లో దీపికా పదుకొణె

బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న 'రాకా'లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో 'ఎనిమిది గంటల పని' నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. 'రాకా' కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, 'రాకా'లో తన షూటింగ్‌ను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్‌లో పాల్గొంటూనే తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ని ఇలా బ్యాలెన్స్ చేస్తుండడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌తో దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.





# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మరోమారు వార్తల్లో నటి నమిత


## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కియారాపై ట్రోల్స్...బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్ లోని 'తబాహి' వీడియో పాటపై ట్రోల్స్ వచ్చాయి. యశ్, కియారా మధ్య ఉన్న రొమాంటిక్ సన్నివేశాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. యశ్‌ను ప్రశంసిస్తూ.. కియారాను విమర్శించడంపై 'టాక్సిక్'లో నటిస్తోన్న బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్ అద్భుతంగా కనిపించాడంటూ కామెంట్ సెక్షన్‌లో ఎమోజీలతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ కియారా విషయానికి వస్తే, ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 'పెళ్లి అయ్యాక కూడా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం అవసరమా' అని మాట్లాడుతున్నారు.




EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/